క్లుప్తంగా

నేటి నుంచి సత్తెమ్మతల్లి జాతర


ఉండూరు గ్రామంలోని సత్తెమ్మ తల్లి ఆలయం

సామర్లకోట: మండల పరిధిలోని ఉండూరు గ్రామంలో సత్తెమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. సామర్లకోట నుంచి ఉండూరు వెళ్లే రోడ్డులో కొలువై ఉన్న సత్తెమ్మ తల్లి అమ్మవారిని గ్రామ దేవతగా కొలుస్తున్నారు.

స్నేహితుడి కుటుంబానికి రూ.1.2 లక్షల ఆర్థిక సాయం


స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పెద్దాపురం: వారంతా ఒకనాటి విద్యార్థులు. నేడు పెద్దవారై ఒకరికొకరు అండగా నిలబడి స్నేహానికి నిర్వచనం ఇచ్చారు. మండలం చంద్రమాంపల్లి 1997–98 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన వారంతా జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు. వారిలో తాటిపర్తి గ్రామానికి చెందిన గౌతు వల్లయ్య ఇటీవల పిఠాపురం మండలం విరవాడ వద్ద అయ్యప్ప స్వామి మాలధారణ చేపట్టి తిరిగి వస్తూ ట్రాక్టర్ ఢీ కొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మిత్రులందరూ ఎక్కడెక్కడో ఉన్నందున వల్లయ్య అంత్యక్రియలకు హాజరు కాలేకపోయారు. తమ వంతు సాయంగా ఆ కుటుంబానికి అండగా నిలవాలని ప్రతి ఒక్కరూ చేతనైన సాయం అందించి సుమారు రూ.1.20 లక్షలు సమకూర్చారు. ఆ మొత్తాన్ని పెద్ద అన్నయ్య సత్తిబాబు, భార్య నాగలక్ష్మి, కుమారుడు వీరేంద్ర సాయి, కుమార్తె చంద్ర శిరీషకు అందజేశారు. వారి స్నేహబంధాన్ని, అంతకు మించిన ఔదార్యాన్ని పలువురు వేనోళ్ల అభినందించారు.

వైభవంగా నీరాటోత్సవం

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా గోదా అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా శనివారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో అమ్మవారి అభిషేకాలు నిర్వహించారు. గోదా అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పెళ్లికూతురిని చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం గోదా కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నీరాటోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు.

సారా విక్రేతలకు రిమాండ్

సామర్లకోట: నాటు సారా విక్రయిస్తూ పట్టుబడిన ఇద్దరు మహిళలకు కాకినాడ ఎక్సైజ్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ నార్త్ స్టేషన్ సీఐ కె.రామోహన్‌రావు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కుమ్మర వీధికి చెందిన గుబ్బల పార్వతి, గుబ్బల వీరయ్యమ్మలను 20 లీటర్ల సారాతో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వీరిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు


టెంట్లను తొలగిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై స్వామినాయుడు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలకు ఏర్పాటు చేసిన టెంట్లను శనివారం పోలీసులు తొలగించారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలు సంక్రాతి పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

సెబ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలో గ్రామాల్లో శనివారం విస్తృతంగా దాడులు చేసి సారాతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం జగపతినగరంలో డ్యూటీ పెయిడ్ లిక్కర్ ఆరు మద్యం సీసాలతో రావుల నాగరాజును, ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఏడు మద్యం సీసాలతో చిలకలపల్లి లక్ష్మిని, లంపకలోవలో 30 లీటర్ల సారాతో వాసంశెట్టి సరస్వతిని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెకు పండగొచ్చింది

- పెద్ద పండగకు సర్వం సిద్ధం
- భోగిపళ్లకు చిన్నారులు సైతం..


సామర్లకోటలో భోగి పిడకలతో సందడి చేస్తున్న చిన్నారులు

సామర్లకోట: సంక్రాంతి పండగకు పల్లెలు ఘనస్వాగతం పలుకుతున్నాయి. మొదటి పండగైన భోగికి పిల్లా, పెద్దా అంతా కలసి కలప సిద్ధం చేశారు. ఇప్పటికే మంటలో వేయడానికి భోగి పిడకలతో దండలు తయారుచేశారు. మంట చల్లారిన తరువాత ఆ పిడక భస్మాన్ని నుదిట ధరిస్తే మంచిదని పెద్దల నమ్మకం. మరోవైపు ఆవు పిడకలను విక్రయించే వారు ఎక్కువయ్యారు. పెద్ద పండగ సందర్భంగా ఇప్పటికే గ్రామాల్లో ఇల్లిల్లూ శుభ్రమైపోయాయి. ఇంట్లోని చెత్తనంతా బయటకు చేర్చి భోగిమంటలో వేసేందుకు సిద్ధం చేశారు.

కిటకిటలాడిన రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్..

సంక్రాంతి సందర్భంగా ఎక్కడెక్కడివారూ స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఉన్న అనేక మంది తమ తమ స్వగ్రామాలకు చేరుకోవడానికి ప్రధాన కూడలి సామర్లకోట రైల్వే స్టేషన్‌లో దిగారు. దాంతో రైల్వే స్టేషన్ ప్రయాణికుల సందడితో నిండిపోయింది. రైళ్లలో దిగిన ప్రయాణికులు వారి వారి ఇళ్లకు చేరుకోవడానికి ఎదురుగా ఉన్న బస్సు కాంప్లెక్స్‌లోనికి రావడంతో బస్సు కాంప్లెక్స్ రద్దీగా మారింది.

పల్లెల్లో సంక్రాంతి

కొత్తపల్లి: గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. ఇంటింటా సంక్రాంతి కళ తొణికిసలాడుతోంది. పొట్టకూటి కోసం ఉన్న ఊరును విడిచిపెట్టి వెళ్లిన వారంతా ఇళ్లకు తిరిగి వస్తున్నారు. బంధువుల రాకతో ముఖ్యంగా కొత్త అల్లుళ్ల రాకతో పల్లెలు కళకళలాడాయి. భోగి, మకర సంక్రాంతి, కనుమ ఏర్పాట్లలో గ్రామీణులు తలమునలకయ్యారు.

సందడే సందడి

ప్రజలు పాడి పంటలు, పశుసంపద, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుతూ మూడు రోజుల పాటు సంక్రాంతి పండగను వైభవంగా జరుపుకునేందుకు పల్లెలు ముస్తాబయ్యాయి. పండుగకు స్వాగతం పలుకుతూ మహిళలు ఇళ్ల ముంగిట రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు. అందులో గొబ్బెమ్మలు పెట్టి గుమ్మడి, తంగేడు తదితర పూలతో అలంకరించి పూజలు చేస్తున్నారు. పిఠాపురం, కొత్తపల్లిలో వస్త్ర దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. గతేడాది ఒడిదుడుకులను ఎదుర్కొన్న రైతన్నలు ఖరీఫ్ దిగుబడి ఆశించిన మేర రాకున్నా కాస్త మెరుగ్గానే ఉండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భోగికి ఏర్పాట్లు

గ్రామాల్లో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు భోగి మంటలకు కలపను సిద్ధం చేశారు. ఇప్పటికే ఇళ్లకు సున్నాలు, రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. పనికి రాని వస్తువులను భోగి మంటల్లో వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. చిన్నారులు భోగి పిడకల తయారీలో నిమగ్నమయ్యారు.

కోడి పందేలకు సై

మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించడానికి పందెం రాయుళ్లు సిద్ధమవుతున్నారు. కోడి పందేలు నిర్వహించకూడదని నిషేధాజ్ఞలు ఉన్నా వాటిని ఎవరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఓ పక్క కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే కఠినంగా శిక్షిస్తామని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరోపక్క పందెరాయుళ్లు మారుమూల ప్రాంతాల్లో బరులు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని పలు కొబ్బరి తోటలు, లే అవుట్ల పందేలు ఆడేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


సామర్లకోటలో భోగి మంటలకు ఏర్పాట్లు


భోగి మంటలకు దుంగలు సేకరిస్తున్న చిన్నారులు


పందేలకు సిద్ధం చేస్తున్న కోళ్లు

ఘనంగా సంక్రాంతి సంబరాలు


భోగి మంట వద్ద విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల కోలాహలం

పెద్దాపురం: మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాల డైరెక్టర్లు రాయవరపు వీరబాబు, సత్య దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులు హరిదాసు వేషధారణతో రంగుల హరివిల్లు పోటీలు, భోగి మంట, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సాంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఓ వేణు, కో-డైరెక్టర్లు శాంతివర్ధన్, చంటి, అప్పలరాజు, శివ, శ్రీనివాస్, ఫణీంద్ర పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్మన్ తులసీ మంగతాయారు తదితరులు

పెద్దాపురం: పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే ఎక్కువ కష్టించేది పారిశుధ్య కార్మికులేనని, పట్టణ అభివృద్ధిలో వారిదే కీలకపాత్ర అని పెద్దాపురం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. సంక్రాంతి సందర్భంగా పారిశుధ్య కార్మికులకు ఏటా ఇచ్చే నూతన వస్త్రాలను శనివారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ అవార్డు పొందామంటే పట్టణ పరిశుభ్రతకు కార్మికులు చేస్తున్న సేవేనన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు మాట్లాడుతూ మున్సిపాలిటీలో సుమారు 45 మంది సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక..


కొండెవరంలో కలసిన పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2007–2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి


సామర్లకోట పోలీసు స్టేషన్‌లో సిబ్బందితో ఎస్పీ సతీష్‌కుమార్

- ఎస్పీ సతీష్‌కుమార్

సామర్లకోట: శాంతి భద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన సీఐ క్యాబిన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు అనుమతులు లేవన్నారు. డీఎస్పీ కె.లతాకుమారి, సీఐ డి.సురేష్, ఎస్సైలు మౌనిక, మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయికి మేడపాడు కబడ్డీ జట్టు


జి.మేడపాడు కబడ్డీ జట్టు

సామర్లకోట: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా మండల స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీలు శనివారంతో ముగిసాయి. ఈ మేరకు ఫైనల్‌లో పవర–జి.మేడపాడు జట్లు తలపడ్డాయి. పవర జట్టు 16 పాయింట్లు సాధించగా జి. మేడపాడు జట్టు 26 పాయింట్లు సాధించి విజయ ఢంకా మోగించింది. ఈ మేరకు ఈ నెల 25 నుంచి పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో ప్రారంభం అయ్యే నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో జి.మేడపాడు జట్టు పాల్గొంటున్నట్టు పీడీ యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. నియోజక వర్గానికి ఎంపికైన కబడ్డీ జట్టును మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ అభినందించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


వాకతిప్పలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

కొత్తపల్లి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని వాకతిప్పలో శనివారం ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ రంగవల్లికలతో ఆకట్టుకున్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సచివాలయ కన్వీనర్ ఆనాల జయకుమారి, ఏడిత పెదతల్లి, గింజల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల పెద్ద మనసు

- ఆర్‌ఎంసీకి వసతుల కల్పన


డిజిటల్ బ్లాక్ బోర్డును ప్రారంభిస్తున్న డాక్టర్ నరసింహం

కాకినాడ క్రైం: విద్యా బుద్ధులు నేర్చుకుని ఉన్నత స్థాయిలో వెలుగొందుతున్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న కళాశాల, అనుబంధ ఆసుపత్రి అభివృద్ధిలో కీలక భాగస్వాములవుతున్నారు. ఆర్‌ఎంసీ 1998 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులు రూ.3.5 లక్షల విలువైన డిజిటల్ క్లాస్ రూం బోర్డును ఫోరెన్సిక్ డిపార్టుమెంట్‌కు సమకూర్చారు. ఆ బ్యాచ్ విద్యార్థులైన సైకియాట్రిస్టు డాక్టర్ వానపల్లి వరప్రసాద్, గైనకాలజిస్టు డాక్టర్ కరుణ బోర్డుతో సహా ఏసీ వంటి ఉపకరణాలను తమ బ్యాచ్ తరపున ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణికుమార్ బృందానికి అందజేశారు. వీటిని రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్‌ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహం ప్రారంభించారు. అనంతరం జీజీహెచ్‌లోని ఎస్పీఎం గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 1972 ఎంబీబీఎస్(జెమ్స్) బ్యాచ్‌కు ఎస్పీఎంకు రూ.5 లక్షలు విలువైన డిజిటల్ బ్లాక్ బోర్డు, రెండు టీవీలు సమకూర్చారు. జెమ్స్ బ్యాచ్ తరపున డాక్టర్ పబ్బినీడి రఘునాథ్, డాక్టర్ ఎస్వీ బాబు, డాక్టర్ జి.రవికుమార్, డాక్టర్ పీఎస్ఎన్ రాజు వీటిని అందజేయగా డీఎంఈ డాక్టర్ డీఎస్వీఎల్ నరసింహం ప్రారంభించారు. ఆయనతో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీమాధవి 1972, 1998 బ్యాచ్ విద్యార్థుల సంకల్పాన్ని కొనియాడారు. ఎస్పీఎం గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్పీఎం ప్రొఫెసర్ డాక్టర్ సుజాత, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, ఎస్పీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రుక్మిణి, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ


108 రకాల పిండి వంటలతో అమ్మవారికి సమర్పించిన సారె


సారెతో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవి అమ్మవారికి 108 రకాల పిండివంటలను సారెగా సమర్పించారు. పాత సంచుల వర్తక సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముత్తయిదువులు అమ్మవారికి సారె సమర్పించారు. సాంప్రదాయబద్ధంగా మేళతాళాలు, కావుళ్లు, ఎడ్లబండితో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో వైభవోపేతంగా ఊరేగించారు. వేలాది మంది సారెను తిలకించి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి మంగళస్నానం నిర్వహించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో కంకిపాటి జమీలు, దాడిశెట్టి విష్ణుచక్రం, ధర్మకర్తలు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

ధనుర్మాస ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఏడు గంటలకు గోదారంగనాథుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బైక్ ర్యాలీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ


గోకవరంలో బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

గోకవరం: అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఈ నెల 22న విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన ఆధ్వర్యంలో గోకవరం మండలంలో భారీ బైక్ ర్యాలీ చేపడుతున్నట్టు సంఘ వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ బైక్ ర్యాలీ పోస్టర్‌ను శనివారం రాత్రి స్థానిక దేవీచౌక్ ఆలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరంలోని తంటికొండకు వెళ్లే మార్గంలో సీఎండీ కేఎస్‌వీవీ ఫిన్స్ లేఅవుట్ నుంచి చేపట్టే ఈ భారీ బైక్ ర్యాలీ గోకవరం, రంపయర్రంపాలెం, పెంటపల్లి తదితర గ్రామాల మీదుగా సాగుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం లేఅవుట్‌లో భారీ అన్నదానం నిర్వహిస్తామన్నారు. అలాగే పలు ధార్మిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు వల్లూరి జగన్నాథ శర్మ, శ్రీనివాస్‌శర్మ, సంఘ సభ్యులు వరసాల ప్రసాద్, ఇనకోటి బాపన్నదొర, మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, బొమ్మిరెడ్డి తారక్ పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించిన మేరీ సోనియా తదితరులు

సామర్లకోట: రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా విజయవాడ స్మృతివనంలో నిర్మించిన డాక్టరు బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మడికి మేరీ సోనియా అన్నారు. శనివారం సాయంత్రం బ్రౌన్‌పేటలోని ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 19న అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆమె పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆమె జన్మదినాన్ని పురస్కరించుకుని పాస్టర్లు, క్రైస్తవ సంఘ నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసులకు సేవా పురస్కారాలు


సామర్లకోట కానిస్టేబుల్‌కు అవార్డు అందజేసిన ఎస్పీ సతీష్‌కుమార్

సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉత్తమ సేవలందిస్తున్న కానిస్టేబుళ్లు, హోమ్ గార్డులకు ఎస్పీ సతీష్‌కుమార్ అవార్డులు అందజేసి అభినందించారు. సామర్లకోట పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఆయన కంప్యూటర్ ఆపరేటర్ ఎం శ్రీను, కానిస్టేబుళ్లు ఎస్.శ్రీనివాసరావు, పి.రామాంజనేయులు, హోమ్ గార్డులు ఎస్.సన్యాసిరావు, ఆర్.ఈశ్వరరావులకు అవార్డులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కె.లతాకుమారి, సీఐ డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లక్ష తులసి, కుంకుమ పూజలు


ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం కెనాల్ రోడ్డులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసం, శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని తెల్లవారు జామున గోపూజ, ఉదయం అభిషేకాలు, లక్ష తులసీ పూజలు చేశారు. రాత్రి దంపతులచే లక్ష కుంకుమ పూజలు చేశారు. ఈ పూజలను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం రాత్రి అన్నదానం ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వేత్త గోలి ధర్మరాజు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్రాకు విశేష స్పందన

కిర్లంపూడి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. వీరవరం నరసింహం నివాసంలో శనివారం యువ నాయకుడు తోట రాంజీ, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు.